నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, శనివారం 26 అక్టోబర్ 2024 | HANUMAKONDA

దేవరుప్పులలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రైతాంగ సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?

- రైతుబంధు ఎగ్గొట్టి అన్నదాతలను నట్టేట ముంచిన సీఎం రేవంత్‌రెడ్డి
- హామీలు అమలు చేయకుండా విదేశీ పర్యటన చేస్తున్న మంత్రులు
- త్వరలో అన్నదాతల పక్షాన బీఆర్ఎస్ కార్యాచరణ
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, అక్టోబర్ 25: రైతులు తీవ్ర సంక్షోభంలో ఉంటే వారి సమస్యలు ప్రభుత్వానికి పట్టవా.. అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. దేవరుప్పుల మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులకు అనేక మాయమాటలు చెప్పి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి వారిని పట్టించుకోవడం లేదన్నారు. పండిన ప్రతి గింజా కొంటామని చెప్పిన ప్రభుత్వం సన్నబియ్యం ఎప్పుడు కొంటుందో, ఆ ధాన్యానికి బోనస్ ఎప్పుడిస్తుందో తెలపాలని ఎర్రబెల్లి ప్రశ్నించారు. ఇప్పటికే రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువకు అమ్ముకుంటుండగా, నేటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించని ప్రభుత్వంపై వారు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. మూడు పంటలకు రైతుబంధు ఇస్తామని, మరో ఐదువేలు పెంచి రూ. 15 వేలు ఇస్తామన్న రేవంత్‌రెడ్డి ఉన్న రైతుబంధును ఎగ్గొట్టి వారిని నట్టేట ముంచాడన్నారు. పదేళ్లలో ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించిన రైతులు ఈ ప్రభుత్వం పుణ్యమా అని పది నెలల్లో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుంటున్నారని దయాకర్‌రావు అన్నారు. గోరంత చేసి, కొండంత ప్రకటనలతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ కాక, రైతుబంధూ లేక, సాగు నీరందక, 24 గంటల కరెంటు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మంత్రులు విదేశీ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. ప్రతి కొనుగోలు సెంటర్‌లో సన్నబియ్యం కొనాలని, మండలంలో ఒకటి రెండు సన్నబియ్యం కొనుగోలు కేంద్రాలు పెడతామని అధికారులు అంటున్నారని, దీనిలోని పరమార్థమేమిటని ప్రశ్నించారు. ఇకనైనా రైతులకు న్యాయం చేయని పక్షంలో రైతుల పక్షాన ఒకట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణ చేపట్టి ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తామని ఎర్రబెల్లి హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

వరద బాధితులను మరిచిన కాంగ్రెస్

- రైతు భరోసాను ఎగ్గొట్టిన సర్కారు
- హైడ్రా పేరుతో నిరుపేదల్లో భయం
- ఎన్నికల హామీలను అమలు చేయని హస్తం పార్టీ
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ రవీందర్ రావు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 25 : అకాల వర్షంతో జిల్లా అతలాకుతలమైతే కాంగ్రెస్ ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడం మరిచిందని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం మహబూబాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు రైతుభరోసాను ఎగ్గొట్టిన గొప్ప పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఎకరాకు రూ. 15 వేల రైతుబంధు ఇస్తామని, క్వింటా వడ్లకు రూ. 500 బోనస్ అని అధికారంలోకి వచ్చినంక సన్నాలకే ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. ఖరీఫ్‌లో పంట కోత దశకు వచ్చినా రైతుబంధు ఇవ్వలేదన్నారు. ఇప్పటికీ ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించ లేదన్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం నిరుపేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదన్నారు. మొదటగా పంటలకు ఉపయోగపడే చెరువులు, కుంటను సర్వే చేయించి వాటిని అభివృద్ధి చేయాలని, పేదల ఇండ్లను కూల్చడం బంద్ చేయాలన్నారు. రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందక ఇబ్బంది పడుతున్నారని, గ్రామాల్లో పారిశుధ్య పనులు అసలే చేయించడం లేదన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నదన్నారు. గిరిజన జిల్లాను ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే కలిసి అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం పట్టణంలో వెజ్ నాన్ వెజ్ మార్కెట్‌ను కట్టించిందని, కలెక్టర్ వెంటనే ప్రారంభించి లబ్ధిదారులకు అందించాలన్నారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ఆగిపోయిందని, రూ. రెండు లక్షల రుణమాఫీ గ్రామాల్లో 40 శాతం మాత్రమే పూర్తయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మంగళంపల్లి కన్న, ఎడ్ల వేణు, తేళ్ల శ్రీను, జేరిపోతుల వెంకన్న, కరుణాకర్ రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే క్రిమినల్ చర్యలు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా
- 'నమస్తే తెలంగాణ ఎఫెక్ట్'

జనగామ చౌరస్తా, అక్టోబర్ 25: చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్య కొనుగోలు చేసిన భూమిలో అవినీతికి పాల్పడినట్లు తేలితే క్రిమినల్ కేసులు పెడతామని జనగామ కలెక్టర్ రిజ్వానా బాషా హెచ్చరించారు. సమాఖ్య జనగామ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో నాలుగెకరాల భూమిని రూ.2.35 కోట్లకు కొనగా, శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'మహిళా సమాఖ్యలో నిధుల గోల్‌మాల్' కథనానికి కలెక్టర్ స్పందించారు. దానిపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక అందజేయాలని డీఆర్డీవో వసంతతో పాటు జనగామ తహసీల్దార్‌కు ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో ఆ భూమిని తహసీల్దార్ శుక్రవారం పరిశీలించి చుట్టుపక్కల ఉన్న రైతులతో మాట్లాడి మార్కెట్, రిజిస్ట్రేషన్ ధర ఎంత? ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై డీఆర్డీవో సమగ్ర నివేదిక సమర్పించిన అనంతరం అవినీతి జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలుంటాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3వేల నకిలీ పట్టాలు

- ఎటూతేలని పోడు పట్టాల వ్యవహారం
- రెండు శాఖలకు తలనొప్పిగా మారిన దందా
- ఆందోళనలో పోడు సాగుదారులు
- పోడు పట్టాలకు రుణాలు ఇవ్వమంటున్న బ్యాంకర్లు

అసలుకు మించి..

పోడు సాగుదారులకు హక్కు పత్రాలు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం అర్హులకు పంపిణీ చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వాటికి మించి నకిలీ పట్టాలు బయటపడుతున్నాయి. ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలోని పలు గ్రామాల్లో సుమారు మూడు వేల నకిలీ హక్కు పత్రాలు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నకిలీ పట్టాల దందాతో గత ప్రభుత్వం హయాంలో ఒరిజినల్ పట్టాలు పొందిన రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వమంటున్నారు. నకిలీ ఏదో, అసలు పట్టాలు ఏవో తెలియక ఇటు బ్యాంకు, అటు అటవీ, పోలీస్ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- ములుగు, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ)

కొందరు గిరిజనేతరులు అత్యాశకు పోయి మధ్యవర్తులకు ఎకరానికి రూ.10వేలు, నాలుగు ఎకరాలకు రూ.40వేల చొప్పున చెల్లించి నకిలీ పట్టాలు పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా కొనసాగిన ఈ దందాను ఆదిలోనే తుంచివేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. సదరు ముఠా ప్రజలను రైతు భరోసా పేరుతో నమ్మ బలికి ఈ పట్టాలను అందజేశారు. గత ప్రభుత్వం పోడు సాగుదారులకు అందించిన హక్కు పత్రాలతో ప్రస్తుతం వారందరికీ రైతు బంధు పథకంతో పాటు పంట రుణాలు సకాలంలో అందుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న ముఠా సభ్యులు గ్రామాల్లో ఏజెంట్ వ్యవస్థను స్థాపించుకొని ఎకరానికి రూ.10 వేల చొప్పున వసూలు చేసి నకిలీ పట్టాలను తయారుచేసి అందించారు. భూములు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియనప్పటికీ పట్టాలను మాత్రం పుచ్చుకున్నారు. గిరిజనేతరులు పోడు పట్టాలు తీసుకొని బ్యాంకుల వద్దకు రుణాల కోసం రావడంతో అధికారులు గుర్తించడంతో గుట్టురట్టయ్యింది. మరికొందరు బ్యాంకు అధికారులు మధ్యవర్తులు ఇచ్చే ముడుపులకు ఆశపడి రుణాలను మంజూరు చేశారు. రెవెన్యూ పోర్టల్‌లో అటవీ పట్టాలు చూపించక పోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ వివరాలు ఐటీడీఏల పరిధిలో లిస్ట్ రూపంలో ఉండగా, నకిలీ పట్టాలు ప్రజల చేతులు మారడంతో ప్రస్తుతం పోడు పట్టాలను బ్యాంకు అధికారులు నమ్మడం లేదు.



ములుగు మండల పరిధిలోని గిరిజనేతరులకు అందించిన నకిలీ పట్టా పాస్ పుస్తకం

పోడు పట్టాలకు రుణాలు ఇవ్వమంటున్న బ్యాంకర్లు

అటవీ హక్కుల చట్టం 2006 కింద గత ప్రభుత్వ హయంలో పోడు పట్టాలను పంపిణీ చేసి జిల్లా కలెక్టరేట్ల నుంచి పంట రుణాలను అందించే అన్ని బ్యాంకులకు రైతుల వివరాలను పంపించారు. ఇంతకాలం దీని ఆధారంగా బ్యాంకర్లు రుణాలను అందించారు. గత యాసంగితో పాటు ప్రస్తుత వానకాలంలో కొందరు రైతులకు రుణాలను పంపిణీ చేయగా గ్రామాల్లో ఇంకా చాలా మంది రుణాలు పొందాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ జరగడంతో కొత్త రుణాలు పొందినట్లయితే భవిష్యత్‌లో మాఫీ అవుతాయనే ఆశతో పోడు సాగుదారులు ప్రభుత్వం అందించిన పట్టాలను తీసుకెళ్లి రుణాలను మంజూరు చేయాలని కోరారు. నకిలీ పట్టాల వ్యవహారం బయటపడడంతో బ్యాంకు అధికారులు అసలు పట్టాదారులకు కూడా రుణాలను అందించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. మొత్తానికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో అసలైన లబ్ధిదారులకు నకిలీ పట్టాలు శాపంగా మారాయి. అసలుకు ఏ మాత్రం తీసిపోని విధంగా తయారు చేసిన నకిలీ పాస్ పుస్తకాలను గుర్తించడంలో అధికారులు, బ్యాంకర్లకు తలనొప్పి వ్యవహారంగా మారింది. కాగా, అధికారులు అసలు, నకిలీ పట్టాలను కనిపెట్టడంతో పాటు వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 3వేల హక్కు పత్రాలను ఎప్పుడు రికవరీ చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పాటు దందాకు తెర లేపిన ముఠాలో ఐదు గురిని ములుగు జిల్లాలో అరెస్టు చూపగా దీని వెనుక సూత్రధారులు, పాత్రధారుల కథను ఎప్పుడు ముగిస్తారో వేచిచూడాల్సి ఉంది.



గత ప్రభుత్వం ఇచ్చిన పట్టా పాస్ పుస్తకానికి ఏ మాత్రం తీసిపోని నకిలీ పాస్‌పుస్తకం

గర్భిణికి అందని వైద్యం

- వర్ధన్నపేట దవాఖానలో అందుబాటులో లేని వైద్యులు
- వరంగల్ సీకేఎంకు వెళ్లమని సూచించిన నర్సులు
- 108 వాహనంలో డెలివరీ

వర్ధన్నపేట, అక్టోబర్ 25: 24 గంటలపాటు వైద్య సేవలందించాల్సిన వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖానలో అర్ధరాత్రి గర్భిణికి వైద్యం అందక తీవ్ర అవస్థలు పడింది. వైద్యులు అందుబాటులో లేరని వెళ్లగొట్టారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర నాగమణికి పురిటి నొప్పులు రావడంతో గురువారం అర్ధరాత్రి వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. స్టాఫ్ నర్సు గర్భిణిని చూసి పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు లేరని, సరైన పరికరాలు కూడా లేవని చెప్పి వరంగల్ సీకేఎం ఆసుపత్రికి తీసుకువెళ్లమని సూచించింది. దీంతో 30 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే 108 వాహనం ద్వారా వరంగల్‌కు తీసుకువెళ్తుండగా తెల్లవారుజామున 2గంటల సమయంలో పంథిని గ్రామ సమీపంలో నాగమణికి నొప్పులు అధికమయ్యాయి. దీంతో పైలట్ ఎల్లాగౌడ్, మెడికల్ టెక్నీషియన్ సదానందం చాకచక్యంగా వ్యవహరించి కాన్పు చేయగా మగశిశువుకు జన్మనిచ్చింది. వెంటనే తల్లి, బిడ్డను సీకేఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా వారు క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఆసుపత్రిలో 30 మంది వైద్యులు పనిచేస్తున్నా కనీసం రాత్రి సమయంలో ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా వైద్యులు, సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

108 వాహనంలో బిడ్డకు జన్మనిచ్చిన మహిళ

బతిలాడినా వైద్యం చేయలేదు

ఎంత బతిమిలాడుతున్నా నర్సులు వైద్యం చేయలేదని బాధితురాలి భర్త అజయ్, ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం డ్యూటీ డాక్టర్‌ను కూడా ప్రాధేయపడినా కూడా పిలవలేదని పేర్కొన్నారు. వెంటనే 108కు ఫోన్ చేసి వరంగల్ సీకేఎంకు తీసుకువెళ్తుంటే వాహన సిబ్బంది సహకరించడంతో ప్రసవం జరిగిందన్నారు.

మౌలిక వసతులు, వైద్య సేవలపై ఆరా

వరంగల్‌లో ప్రభుత్వ దవాఖానల తనిఖీ

ఎంజీఎం ఎమర్జెన్సీ వార్డును పరిశీలిస్తున్న తనిఖీ బృందం

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 25: నగరంలోని కాకతీయ మెడికల్ కళాశాల పరిధిలోని ప్రభుత్వ దవాఖానల పనితీరు, వసతులను ప్రత్యేక వైద్యుల బృందం శుక్రవారం సందర్శించి, తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాల మేరకు డాక్టర్లు నాగేందర్, సీవీ శారద, విమలా థామస్ సభ్యులతో కూడిన ప్రత్యేక బృందం ఎంజీఎం హాస్పిటల్, కాకతీయ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్, ప్రాంతీయ నేత్ర వైద్యశాల, సీకేఎం ప్రసూతి వైద్యశాల, హనుమకొండ జిల్లా పరిధిలోని ప్రసూతి వైద్యశాల, టీబీ హాస్పిటల్‌ను పరిశీలించింది. అధ్యాపకుల హాజరు, మౌలిక వసతులు, యంత్ర పరికరాలు, సమస్యలు, పెండింగ్ బిల్లుల వివరాలను సభ్యులు నమోదు చేసుకున్నారు. ఎంజీఎం, సూపర్‌స్పెషాలిటీ హాస్పిటళ్లలో వార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఆర్ఎంవో డాక్టర్ మురళి, విభాగాధిపతులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కేఎంసీలో ఉత్సాహంగా క్రితి-24

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 25: కాకతీయ మెడికల్ కళాశాలలో ఎన్ఆర్ఐ, యూఎస్ ఎన్నారై అలుమ్ని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాకతీయ రిసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేషన్స్-24(క్రితి-24) వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నైతిక విలువలు, ప్రజల ఆరోగ్య భద్రత అంశాలపై చర్చ జరిపారు. వైరస్ వ్యాప్తి తీరు, నివారణ అంశాలపై హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జెపార్డీ శైలిలో నిర్వహించిన క్విజ్ పోటీలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూఎస్ఏ అలుమ్ని ప్రతినిధి డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం మాట్లాడుతూ కేఎంసీని దేశంలోనే గుర్తింపు కలిగిన వైద్య కళాశాలగా నిలపాలనుకున్న అలుమ్ని కల నెరవేరుతుందన్న నమ్మకం కలుగుతుందని అన్నారు. కేఎంసీలో అంతర్జాతీయ స్థాయిలో వైద్య వృత్తి నైపుణ్యాలు పొందవచ్చునని దేశవ్యాప్తంగా వైద్యవిద్యార్థులు నమ్ముతున్నారని అన్నారు. అందుకు ఉదాహరణగా కార్యక్రమానికి వచ్చిన రిజిస్ట్రేషన్‌ను చూపించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

క్రితి-24 వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

అటవీశాఖ సిబ్బందిపై దాడి

- బేస్ క్యాంప్ సిబ్బంది సురేశ్‌కు తీవ్రగాయాలు
- మూడు ట్రాక్టర్లు సీజ్
- తప్పించుకొని పారిపోయిన పోడుదారులు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 25: డ్యూటీలో ఉన్న ఫారెస్ట్ సిబ్బందిపై పోడుదారులు దాడి చేశారు. దీంతో అటవీ శాఖాధికారులు వారిపై కేసు నమోదు చేసి మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖాధికారి వసంత వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి మండలం ఆముదాలపల్లి, గణపురం మండలం చెల్పూరు శివారు మధ్య అటవీ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి కొందరు పెద్దఎత్తున పోడు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారనే సమాచారంతో భూపాలపల్లి రేంజ్ అధికారి నరేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పోడుదారులను అడ్డుకున్నారు. ఒక్కసారిగా డోజర్లను అటవీశాఖ సిబ్బందిపైకి ఎక్కించి చంపాలనే ప్రయత్నం చేయడంతో వారు తప్పించుకున్నారు. వెంటనే పోడుదారులు కర్రలతో అటవీశాఖ సిబ్బందిపై దాడికి దిగడంతో చెల్పూరు బేస్ క్యాంపు సిబ్బంది జే సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోడుదారులు అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయారు. ఘటనా స్థలంలో పోడుదారులు వదిలి పెట్టిన మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా అడవిని నరికి పోడు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో హెచ్చరించారు.

నీజ్ చేసిన మూడు ట్రాక్టర్లు

దవాఖానలో చికిత్స పొందుతున్న బేస్ క్యాంప్ సిబ్బంది సురేశ్

కళాశాలల క్రీడలు ప్రారంభం

- ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 పోటీలు
- ఈ నెల 29వ తేదీ వరకు నిర్వహణ

జేఎన్ఎస్‌లో అండర్-19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీల్లో హ్యాండ్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు, (ఇన్‌సెట్) కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 25: హనుమకొండలోని జేఎన్ఎస్‌లో అండర్-19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 క్రీడా పోటీలు జరుగనున్నాయి. ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్ క్రీడలు నిర్వహించనున్నారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ పోటీల ప్రారంభోత్సవంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. డీవైఎస్‌వో మాట్లాడుతూ.. క్రీడాకారులు ఆధార్‌కార్డు, లేటెస్ట్ బోనఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్‌లపై కాలేజ్ ప్రిన్సిపాల్ సంతకం చేయించుకొని ఉదయం 8 గంటలకు జేఎన్ఎస్‌లో హాజరు కావాలన్నారు. జూడో క్రీడాంశం వరంగల్ ఓ-సిటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఫిట్ ఇండియా స్వచ్ఛ ఫ్రీడం రన్ 5.0ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, హనుమకొండ, వరంగల్ డీఐఈవో గోపాల్, శ్రీధర్, వెంకట్‌రెడ్డి, దస్రూనాయక్, బరుపాటి గోపి, సతీశ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.